సాక్షి
నంద్యాల

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి సోమవారం విజయవాడకు చెందిన భీమిరెడ్డి కోటిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు వెండి రథోత్సవం నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:15,792
అవుట్ ఫ్లో	:15,432

న్యూస్‌రీల్

యాగంటీశ్వరుడికి రూ.14.5 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో వ్యాపారాల కోసం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంపాటల ద్వారా రూ.14.5 ఆదాయం వచ్చింది. టెంకాయలు విక్రయించుకునే హక్కును యాగంటిపల్లె గ్రామానికి చెందిన బి.రామ్‌నాథ్‌రెడ్డి రూ.13 లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునే హక్కును పాతపాడు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు రూ.1.50 లక్షలకు దక్కించుకున్నారు. తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కుకు సరైన పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా విడుదల

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న పాఠశాల సహాయకుల పదోన్నతికి సంబంధించిన అర్హులైన జాబితాను వెబ్‌సైట్‌లో పొందు పరిచినట్లు ఆర్‌జేడీ శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన పాఠశాల సహాయకులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తత్సమాన హోదా ఉపాధ్యాయుల సినియారిటీ జాబితాను www.doekrn13.blogspot.comలో పొందు పరిచినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే నవంబర్ 1లోపు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శ్రీశైలానికి తగ్గుతున్న వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 30,577 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఆదివారం నుంచి సోమవారం వరకు జూరాల, సుంకేసుల నుంచి 63,439 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 96,836 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టుకేంద్రంలో 15.413 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టుకేంద్రంలో 16.581 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 209.1579 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నీటిమట్టం 883.90 అడుగులకు చేరుకుంది.

నీట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉమామహేశ్వరప్ప

కర్నూలు(అర్బన్): చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల ఐఐటీ/ నీట్ అకాడమీ డైరెక్టర్‌గా జూపాడుబంగ్లాలో ఫిజిక్స్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న బీ ఉమామహేశ్వరప్పను ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకం పట్ల డీసీఓ డా.ఐ శ్రీదేవి, ఎస్‌డబ్ల్యూఆర్ఈఎఫ్ నాయకులు జీ చంద్రశేఖర్, పీఎస్ఎన్ మూర్తి, జయాకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

వీధిన పడిన బతుకులు

- అధికార దౌర్జన్యానికి ఉపాధి కోల్పోయిన పేదలు
- ప్రత్యామ్నాయం చూపకుండా దుకాణాల కూల్చివేత
- సుందరీకరణ పేరుతో చిరువ్యాపారులపై అక్కసు

వారంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన చిరువ్యాపారులు. బైక్ మెకానిక్, కూల్‌డ్రింక్స్, టిఫిన్, పండ్లు, పూల కొట్లతో జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొందరు రోజువారీ, నెలవారి వడ్డీలకు అప్పు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. రోజూవారి వ్యాపారం నుంచి వచ్చే ఆదాయంలో నుంచే అప్పు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారి జీవితాలపై కూటమి ప్రభుత్వం కర్కషంగా వ్యవహరించింది. ఉన్నఫలంగా దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకుంది. ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసు బందోబస్తు, జేసీబీలతో అధికారులు అక్కడికి చేరుకుని దుకాణాలు నేలమట్టం చేయడంతో వాటిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడ్డాయి. – నంద్యాల(సిటీ)

జిల్లా కేంద్రంలోని నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద దాదాపు 300 వందలకు పైగా పేద కుటుంబాలు చిన్నచిన్న దుకాణాలు వేసుకుని 30 ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్నాయి. వీరంతా ఏ రోజుకు ఆరోజు సంపాదనతో అద్దె గృహాల్లో ఉంటూ జీవనం సాగించుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారుల అనాలోచిత చర్యల వల్ల వీరి బతుకులు రోడ్డున పడుతున్నాయి. జిల్లా కేంద్రాన్ని సుందరీకరణ చేయాలనే సాకుతో ఇక్కడి చిరువ్యాపారుల దుకాణాలను సోమవారం కూల్చేశారు. ఎలాంటి ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఉన్న ఫలంగా వారి పొట్ట కొట్టడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ మార్గం కల్పించి నష్ట పరిహారం చెల్లించాలని బాధిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి మాటున అధికారులు, పాలకపక్షం ఉన్మాదంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు స్థానికులు, వ్యాపారుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.



జేసీబీతో కూల్ డ్రింక్స్ దుకాణం నేలమట్టం చేస్తున్న దృశ్యం

అభివృద్ధి ఒకే.. ప్రత్యామ్నాయం ఏదీ?

గత ప్రభుత్వ హయాంలో ముందస్తు ప్రణాళికతో బొగ్గులైన్ నిర్వాసితులకు పట్టాలు ఇచ్చాకే మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. బొమ్మల సత్రం నుంచి నూనెపల్లెకు ప్రధాన రహదారి నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బొగ్గులైన్ నిర్వాసితులకు జగనన్న లే అవుట్‌లో స్థలాన్ని ఇచ్చింది. అప్పట్లోనూ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నిర్వాసితులకు అండగా ఉంటామంటూ రాజకీయం చేసినా .. నేడు దుకాణదారులకు ఎలాంటి న్యాయం చేయకుండా అభివృద్ధి పేరుతో మోసం చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఆక్రమణలు తొలగించాం

నంద్యాల జిల్లా కేంద్రమయ్యాక ట్రాఫిక్ పెరిగింది. కొంత మంది రహదారులకు ఇరువైపులా ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. కొంత మంది అయితే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అద్దెకు కూడా ఇస్తున్నారు. ఈ ఆక్రమణలు తొలగించి జిల్లా కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని భావించాం. అందులో భాగంగా ఆక్రమణదారులకు ముందుస్తు నోటీసులిచ్చాం. వారు స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పోలీసు బందోబస్త్ మధ్య ఆక్రమణలు తొలగించాం. ఇకముందు కూడా ఆక్రమణల తొలగింపు కొనసాగుతుంది. ప్రజలు సహకరించాలని కోరుతున్నాం.

– నిరంజన్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్, నంద్యాల

నూనెపల్లెలో ఆక్రమణల తొలగింపు

నంద్యాల(సిటీ): స్థానిక నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కింద 30 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల షెడ్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు కొద్ది పాటి సమయం ఇవ్వాలని బాధితులు అధికారులను వేడుకున్నా వినకుండా ఆక్రమణలను తొలగించారు. పెద్ద ఎత్తున పోలీసు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రక్రియ చేపట్టకుండా ఇలా తొలగించడం సమంజసం కాదని, తమ పొట్టకూటి కోసం ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలపై అధికారులు, పాలకులు ఇలా ప్రవర్తించడం తగదని బాధితులు గోడు వెల్లబోసుకున్నారు. కాగా పట్టణాభివృధిలో భాగంగా ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



ఉపాధి కోల్పోయి వీధిన పడి దిగాలుగా కూర్చున్న మహిళ సుబ్బమ్మ



దుకాణాన్ని కూల్చి వేస్తుండటంతో సామాను తరలించుకుంటున్న బాధితులు

గంట సమయం అడిగినా ఇవ్వలేదు



నూనెపల్లె ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిన రోజు నుంచి నేటి వరకు మా కుటుంబం మొత్తం కూల్ డ్రింక్స్ దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాం. బంకులు తొలగిస్తారని తెలిసి గత నెల రోజులుగా అధికారులు, పాలకుల వద్దకు తిరుగుతున్నా పట్టించుకోలేదు. ఆదివారం రాత్రి కూడా మంత్రి ఫరూఖ్‌ను కలిసి విన్నవించుకున్నా మా గోడు పట్టించుకోలేదు. ఉదయం అధికారులను ఒక్క గంట పాటు సమయం ఇవ్వాలని బతిమిలాడినా కనికరించకుండా దుకాణం కూల్చేశారు.

– మాధవి, కూల్ డ్రింక్స్ నిర్వహకురాలు, నూనెపల్లె

ప్రత్యామ్నాయం చూపలేదు



మాది సాంబవరం గ్రామం. 15 ఏళ్లుగా ఇక్కడే మెకానిక్‌గా పని చేసుకుంటున్నాను. మా కుటుంబం మొత్తం ఈ దుకాణంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మాకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా అధికారుల దౌర్జన్యంగా బంకు తొలగించి బండలు పగులగొట్టారు. ఇటీవలే రూ.70 వేలు ఖర్చు చేసి బంకు తయారు చేయించాను. అధికారులు మాలాంటి వారి కడుపు కొట్టడం సరికాదు. మాకు ఏదైనా ఉపాధి మార్గం చూపించాక తొలగించాలని వేడుకున్నా పట్టించుకోలేదు.

– మద్దిలేటి, మెకానిక్, సాంబవరం

వీధిన పడ్డాం



25 ఏళ్లుగా మేము ఇక్కడే హోటల్ పెట్టుకుని బతుకుతున్నాం. మున్సిపాలిటీకి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాం. ఈ రోజు అర్ధంతరంగా మమ్మల్ని ఇక్కడి నుంచి వెల్లిపోవాలని చెబుతూ జేసీబీతో రేకుల షెడ్డును తొలగించారు. వంట మధ్యలో ఉందని అధికారులకు విన్నవించుకున్నా కనికరించలేదు. మా హోటల్ మీద 10 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. మాతోపాటు వారందరూ వీధిన పడ్డారు.

– వెంకటలక్ష్మమ్మ, చిరు హోటల్ నిర్వాహకురాలు, నూనెపల్లె

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- ఏపీ సేవా సర్వీసులను క్లియర్ చేయండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్–(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. వినతులను ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలన్నారు. 72 గంటలకు మించి ఒక్క గ్రీవెన్స్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని గతంలో ఆదేశాలిచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని, తహసీల్దార్లతో సమావేశాలు నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు అర్థమయ్యేలా తెలుగులో సమాధానం రాసి ఎండార్స్ ఇవ్వాలన్నారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. కాగా 198 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకోండి

రుద్రవరం మండల కేంద్రంలో పారిశుధ్య చర్యలు చేపట్టడంతోపాటు శుద్ధి చేసిన నీటినే సరఫరా చేసి డయేరియాను నియంత్రణలోకి తీసుకురావాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పీజీఆర్ఎస్, ఏపీ సేవా సర్వీసులు, నైపుణ్య గణన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుద్రవరం మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కచ్చితమైన సురక్షిత నీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో రక్షిత తాగునీటి వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నైపుణ్య గణన శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం పీజీఆర్ఎస్ హాల్‌లో ఏర్పాట్లు చేశామని ఇందుకు ప్రతి మున్సిపాలిటీ, అన్ని మండలాల నుంచి ప్రతిభ ఉన్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈనెల 31న సెలవు దినం అయినందున 30న ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ మొత్తాన్ని డ్రా చేసుకొని నవంబర్ 1న లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు వరకు జరగనున్న కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను దేవస్థాన ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూలైన్లు, లడ్డూప్రసాదాల తయారీ, ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం పుష్కరిణి హారతి, పాతాళగంగ, పార్కింగ్ ప్రదేశాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాదాల తయారీలో శుభ్రతలను పాటించాలన్నారు. శని, ఆది, సోమవారాలు, ప్రభుత్వ సెలవురోజులు, పర్వదినాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదాల తయారు చేసుకోవాలన్నారు. భక్తులు కోరినన్ని లడ్డూప్రసాదాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పుష్కరిణి వద్ద లైటింగ్, పుష్పాలంకరణ చేయాలని, ఆలయ ఉత్తరమాడవీధులలో భక్తులు దీపాలను వెలిగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పాతాళగంగ పరిసరాలను, పాతాళగంగమెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.నరసింహారెడ్డి, పారిశుధ్య విభాగం పర్యవేక్షకులు డి. రాధాకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఐ/సి) పి.వి. సుబ్బారెడ్డి ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ

పెరుగుతున్న అతిసారం కేసులు

రుద్రవరం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, చంద్రునిపేటలో అతి సార వ్యాధి కేసులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే రెండు అతి సారం కేసులు నమోదుకాగా సోమవారం మరో మూడు కేసులు నమోదు కావడంతో మొత్తం ఐదుకు చేరాయి. దీంతో మండల కేంద్రం వాసులు ఆందోళన చెందుతున్నారు. ఆయా కాలనీలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కాగా సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ రుద్రవరానికి చేరుకుని స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అతిసార వ్యాధి బాధితురాలిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా కాలనీలలో పర్యటించి అతిసార వ్యాధి బాధితుల ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఆయా కాలనీలలో పర్యటించి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయించారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలస్వామి, సర్పంచు బైరి విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ రవికుమార్, ఏఈ సుబ్రహ్మణ్యం ఉన్నారు.



రుద్రవరం పీహెచ్‌సీలో చికిత్సలు పొందుదున్న అతిసారం బాధితురాలు

పైసా వసూల్!

- లంచం ఇస్తేనే బాణా సంచా దుకాణాలకు అనుమతి
- ఫైర్, రెవెన్యూ, విద్యుత్, శానిటేషన్ అధికారుల చెయ్యి తడిపితేనే పర్మిషన్
- సిండికేట్‌గా మారి విక్రయాలు సాగించే యోచనలో వ్యాపారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మామూళ్ల రాజ్యం నడుస్తోంది. నిబంధనలు పక్కాగా పాటించినా తమ చేతులు తడపకుంటే అనమతులు జారీ చేసేది లేదని అధికారులు కరాఖండిగా చెబుతున్నారు. దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే టపాసుల దుకాణాలలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారుల తీరు ఇలా ఉంటే.. దుకాణాల యజమానులు మాత్రం అడిగినంత డబ్బు ఇచ్చి అందినకాడికి దోచుకుందామనే యోచనలో ఉన్నారు. పండగ పూట టపాసులు కాల్చి కుటుంబంతో సంతోషంగా గడపాలనుకుంటున్న మధ్య తరగతి కుటుంబాలు టపాసుల రేట్లు చూసి షాక్ అవ్వనున్నారు. – సాక్షి, నంద్యాల



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జిల్లాలో గత ఏడాది 178 దుకాణాలు ఏర్పాటయ్యాయి. టపాసుల విక్రయాల్లో మార్జిన్ 50 శాతం కంటే ఎక్కువగా ఉండడంతో తాము దుకాణాలు ఏర్పాటుచేస్తామని వ్యాపారులు పోటీ పడుతున్నారు. నిబంధనలు పాటించకున్నా మామూళ్లు ఇస్తే ఏమైనా చేసుకోవచ్చని, ఏ రేట్లకైనా అమ్ముకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. దీంతో ఈ ఏడాది దుకాణాల సంఖ్య 200 దాటే అవకాశం ఉంది. గతేడాది జిల్లా కేంద్రంలో 72 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం మండల కేంద్రాల్లో ఒక్కో చోట 8 నుంచి 20 షాపుల వరకు ఏర్పాటు చేశారు. వీటన్నింటికి అధికారులు తాత్కాలిక అనుమతులు ఇస్తారు. రేట్లపై ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిందే రేటుగా నడుస్తోంది. రెండు రోజుల్లోనే ఒక్కో దుకాణం నుంచి రూ.3 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు లాభం వచ్చే అవకాశం ఉండడంతో దుకాణాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

అనుమతుల పేరుతో భారీగా వసూలు

పండుగ సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసుకునే వారు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్, ఫైర్ సేఫ్టీ, శానిటేషన్, మున్సిపాలిటీ/రెవెన్యూ శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిబంధనలకు అనుగుణంగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అనుమతులు జారీ చేస్తారు. జిల్లాలో జీఎస్టీ చెల్లించే శాశ్వత లైసెన్స్ కలిగిన దుకాణాలు 5, పటాసులు నిల్వ ఉంచే గోడౌన్‌లు 3 ఉన్నాయి. పండగకు వ్యాపారం చేసుకునే వ్యాపారులు అడ్వాన్స్ ట్యాక్స్ పే పేరుతో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు రూ.11 వేలు, మున్సిపాలిటీ రూ.2,100 (శానిటేషన్, తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్), ఫైర్‌సేఫ్టీ ఎన్ఓసీకి రూ.550, రెవెన్యూ శాఖకు రూ.550 డీడీ చెల్లించి అన్ని శాఖల సమన్వయంతో ఆర్డీఓ అనుమతులు జారీ చేస్తారు. అయితే అధికారికంగా ఎంతైతే చెల్లిస్తున్నారో... ఒక్కో దుకాణానికి ఆ మొత్తం కంటే రెండు రెట్లు అధికంగా అధికారులు వసూలు చేస్తున్నారు.

దోచుకునేది రూ.కోట్లలో.. చెల్లించేది రూ.వేలల్లో

దీపావళి పండగ సందర్భంగా టపాసుల దుకాణాలను రెండు రోజుల పాటు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. రెండు రోజుల్లో ఒక్కో దుకాణంలో రూ.7 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయాలు జరుగుతాయి. రూ.లక్షల్లో లాభాలు ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. మామూళ్లు ఇస్తుండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దళారుల దందా

అన్ని శాఖల అధికారులను తామే సమన్వయం చేసుకుని అనుమతులు ఇప్పిస్తామని చెప్పి ఇద్దరు, ముగ్గురు నాయకులు అక్రమ వసూళ్లకు తెరలేపుతున్నారు. ఎవరైనా సొంతంగా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నా అధికారుల నుంచి అనుమతులు రావడం లేదు. దీంతో ఆ ఇద్దరు ముగ్గురు దళారులనే వ్యాపారులు ఆశ్రయిస్తున్నారు. ఒక్కో దుకాణం ఏర్పాటు కోసం అన్ని అనుమతులతో పాటు తాత్కాలిక షెడ్డు నిర్మిస్తామని చెప్పి రూ.38 వేల నుంచి రూ.42 వేల వరకు చెల్లించాలని హుకుం జారీ చేశారు. మరోవైపు జిల్లాలో 80 శాతం దుకాణాలను అధికార పార్టీ నాయకులే ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

బిల్లు ఉండదు.. ట్యాక్స్ కట్టరు

వినియోగదారులు వస్తువులు కొన్న తర్వాత దుకాణాదారుడు రసీదు ఇస్తారు. కానీ, టపాసుల విక్రయాల్లో మాత్రం జీరో బిజినెస్ నడుస్తోంది. టపాసులకు సంబంధించి వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. విక్రయాలు సాగించిన మొత్తానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ, వ్యాపారులు మాత్రం ఎలాంటి ట్యాక్స్‌లు చెల్లించకుండానే వ్యాపారం సాగిస్తున్నారు. మరోవైపు టపాసుల రేట్లు కూడా భారీగా పెంచి విక్రయించే ఆలోచనలో దుకాణాదారులున్నారు. సిండికేట్‌గా మారి అందరూ ఫిక్స్‌డ్ రేట్లను పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

తనిఖీలు ఎక్కడ?

సేల్స్ ట్యాక్స్ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయడం లేదు. జిల్లాలో పాణ్యం, కొండజూటూరు, డోన్‌లలో టపాసుల గోడౌన్లున్నాయి. వీటి నుంచే జిల్లాలో తాత్కాలికంగా ఏర్పాటు చేసే దుకాణాలకు టపాసులు సరఫరా కానున్నాయి. అయితే గోడౌన్‌లలో ఎంత సరుకు ఉంది.. ఎంత మొత్తానికి ట్యాక్స్‌లు చెల్లించారు అన్న విషయాలను అధికారులు ఇసుమంతైనా పట్టించుకోవడం లేదు.

అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల(సిటీ): అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసులకు మెడికల్ క్యాంప్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్పీతోపాటు మరో 167 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానంతో ఒక వ్యక్తికి పునర్జన్మ ఇవ్వచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నప్పుడు రక్తం కోల్పోయి వ్యక్తులు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అలాంటి వారిని బతికించుకోవాలంటే ప్రతిఒక్కరూ రక్తం దానం చేయాలన్నారు. అనంతరం 154 మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ బృందం దస్తగిరి, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

ఫిర్యాదులు పునరావృతం కానివ్వొద్దు

పదేపదే కార్యాలయానికి ప్రజలు తిప్పించుకోకుండా వారి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


మృతి చెందిన రాజు

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం దొరకొండ మల గ్రామానికి చెందిన మంగలి రాజు(32)కు చిన్నతనంలో తల్లిదండ్రులు మృతిచెందారు. ఇదే గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంట్లో రాజును పెంచి పెద్దచేశారు. తల్లిదండ్రులతోపాటు తనకంటూ రక్త సంబంధీకులు ఎవరూ లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసయ్యాడు. అడపాదడపా స్వగ్రామం కోవెలకుంట్లకు వచ్చి అతిగా మద్యం సేవించేవాడు. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పడిపోయాడు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో దాహంతో గొంతు ఎండిపోయి మృతి చెంది నట్లు పోలీసులు గుర్తించారు. మృతుని బంధువులకు సమాచారం చేరవేసి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన ఓ వివాహిత సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే యువకుడికి కొలిమిగుండ్ల మండలం హనుమంతగుండం గ్రామానికి చెందిన నీలవేణి (26) అనే మహిళతో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 11 నెలల వయస్సున్న కుమార్తె ఉంది. ఈ క్రమంలో కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన నీలవేణి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు కిందకుదించి చికిత్స నిమిత్తం కోవెలకుంట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

పశువులను కత్తితో పొడిచిన వ్యక్తి అరెస్టు

గోస్పాడు: మూడు రోజుల క్రితం గోస్పాడు మండలంలోని లక్ష్మీపేట, కిందికేరి తదితర కాలనీలలో పశువుల ఆవులు, ఎద్దులు, గేదెలను కత్తితో పొడిచి గాయపరిచిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత శుక్ర, శనివారం రాత్రివేళ గ్రామంలో ఆరుబయట కట్టేసుంచిన మూగజీవాలను గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడిచి తీవ్ర గాయాలు చేసినట్లు పశువుల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు రెండు రోజుల పాటు గ్రామంలో విచారణ జరపగా గోస్పాడుకు చెందిన బండమీద షేక్ మదీనా అనే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలిందని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి, పోలీసులు రవికుమార్, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



ఘాట్ రోడ్ మలుపు వద్ద రక్షణ స్తంభాన్ని ఢీకొన్న కారు

శ్రీశైలం: శ్రీశైలం – దోర్నాల ఘాట్ రోడ్డులో చిన్నారుట్ల చెంచుగూడెం సమీపంలోని మలుపు వద్ద సిఫ్ట్ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణీకులు 108కు ఫోన్ చేయడంతో పాటు ఫారెస్ట్ అధికారులకు కూడా సమాచారం అందించారు. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్ వాహనం ద్వారా ప్రాజెక్ట్ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపింది. కారులో ప్రయాణిస్తున్న వారు తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన వ్యక్తులుగా పోలీసులు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్.. బీ కేర్‌ఫుల్

- రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడమే కారణం
- పెరిగిన బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు
- మానసిక ఒత్తిడి, ధూమ, మద్యపానాలు కారణం
- బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడమూ ఒక కారణమే
- పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్
- కోవిడ్ అనంతరం పెరిగిన కేసులు

మనిషిలోని ముఖ్యమైన అవయవాల్లో మెదడు ఒకటి. శరీరం మొత్తాన్ని నడిపేది ఈ అవయవమే. మెదడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు శరీరం అదుపు తప్పకుండా పనిచేస్తుంది. మెదడులో చిన్న సమస్య తలెత్తినా బ్రెయిన్ స్ట్రోక్ ఏర్పడుతుంది. ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా వచ్చేదే బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం). రక్తప్రసరణలో అవరోధం కలగడం, నరాలు చిట్లడం ప్రధాన కారణాలు. మెదడుకు ఆక్సిజన్, పోషకాలు తీసుకెళ్లే రక్తనరాలు చిట్లడం, రక్తప్రసరణకు అంతరాయం ఏర్పడటం వల్ల మెదడులోని ఆ భాగం కణ మరణానికి దారి తీసి స్ట్రోక్‌కు కారణం కావచ్చు. ఈ నెల 29వ తేదీన వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్)/గోస్పాడు: మారుతున్న జీవనశైలిలో భాగంగా స్ట్రోక్స్ పెరుగుతున్నాయి. ఒకప్పుడు 50 ఏళ్ల దాటితేనే ఇలాంటి సమస్య వచ్చేది. ఇప్పుడలా కాదు. 25 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి నలుగురిలో ఒకరు తమ జీవితకాలంలో స్ట్రోక్ బారిన పడుతున్నారు. చిన్న వయస్సు వారు స్ట్రోక్ బారిన పడటం వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 5 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా. ఈ వ్యాధికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నంద్యాలలోని సర్వజన వైద్యశాలలోనూ న్యూరోఫిజీషియన్లు, జనరల్ ఫిజీషియన్లు చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు రంగంలోనూ ప్రస్తుతం 30 మందికి పైగా న్యూరాలజిస్టులు, 150 మందికి పైగా ఉన్న జనరల్ ఫిజీషియన్లు చికిత్స చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారం ఓపీ నిర్వహిస్తారు. ఆ రెండు రోజుల్లో దాదాపు 500 మంది వివిధ నరాల వ్యాధులతో చికిత్స కోసం వస్తారు. అందులో 20 నుంచి 30 శాతం మంది స్ట్రోక్ (పక్షవాతం) బాధితులు ఉంటున్నారు. వ్యాధిలక్షణాలు కనిపించిన నాలుగున్నర గంటల్లో సమీప నెట్‌వర్క్ ఆసుపత్రికి


పెద్దాసుపత్రిలోని స్ట్రోక్ యూనిట్

వెళితే చికిత్స అందుకుని వైకల్యం నుంచి బయటపడవచ్చు. ఈ క్రమంలో ఖరీదైన మందులు, చికిత్సను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా అందిస్తున్నారు. కాగా పక్షవాతం వచ్చిన రోగులకు నగరంలోని చాలా ఆసుపత్రులు ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద చికిత్స చేయడం లేదు. కేవలం ఒకటి, రెండు ఆసుపత్రుల్లో మాత్రమే స్ట్రోక్‌కు వైద్యం అందుతోంది. నెట్‌వర్క్ ఆసుపత్రులు తమకు ప్యాకేజీ సరిపోదనే భావనతో రోగులను చేర్చుకోవడం లేదు. అయితే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో ఆపరేషన్ అవసరమైన రోగులను మాత్రమే వైద్యసేవ పథకం కింద నెట్‌వర్క్ ఆసుపత్రులు చేర్చుకుని చికిత్స అందిస్తున్నాయి.

కోవిడ్ అనంతరం పెరిగిన బాధితులు

కోవిడ్–19 అనంతరం పక్షవాతం బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కోవిడ్ కారణంగా మనిషి శరీరంలోని రక్తనాళాల్లో పలు చోట్ల రక్తం గడ్డలు (థ్రాంబోసిస్) కట్టుకుని ఉంటోందని, కొన్నిసార్లు ఇవి మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో బ్లాక్ కావడం వల్ల స్ట్రోక్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల చాలా మంది వారికి తెలియకుండానే దీని బారిన పడుతున్నారు.

మొదటి నాలుగున్నర గంటలు కీలకం

బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మొదటి నాలుగున్నర గంటల్లో ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందిస్తే ప్రాణాపాయంతో పాటు వైకల్యం నుంచి బయటపడవచ్చు. బ్రెయిన్ స్ట్రోక్ ఇస్కిమిక్ స్ట్రోక్, హెమరైజ్డ్ స్ట్రోక్ అనే రెండు రకాలుగా వస్తుంది. మెదడులోని రక్తనాళాల్లో రక్తప్రసరణ సక్రమంగా లేకపోవడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలు చచ్చుబడిపోతాయి. దీన్ని ఇస్కిమిక్ స్ట్రోక్ అంటారు. మెదడులోని రక్తనాళాలు చిట్లినప్పుడు అంతర్గతంగా రక్తస్రావం జరుగుతుంది. దీన్ని హెరేజిక్ స్ట్రోక్ అంటారు.

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు

- అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం
- అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం
- ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు ఏర్పడటం
- నడవటానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం
- ఎలాంటి కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

- యువతలో స్ట్రోక్‌కు కారణాలు పనిలో ఒత్తిడి, స్మోకింగ్, మద్యపానం అలవాట్లు.
- జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం, మధుమేహం, రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్ ఎక్కువగా ఉండటం, ఒబెసిటీ ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువ.
- అన్యూరిజం వంటి శరీర నిర్మాణ లోపాలు, పుట్టుకతో జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డకట్టే గుణం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది.
- గుండెజబ్బులున్న వారికి బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో తీవ్రనష్టం

మెదడుకు వెళ్లే రక్తం సరఫరాలో అంతరాయం ఏర్పడటం కారణంగా మెదడు పనితీరు క్షీణించి స్ట్రోక్ వస్తుంది. 85 శాతం మందికి కాళ్లు, చేతులు, చచ్చుబడిపోవడం, కొందరికి మూతి వంకరపోవడం, మాట నత్తిగా రావడం, మాట్లాడలేకపోవడం, కళ్లు మసకబారడం, చూపు కోల్పోవడం వంటివి జరుగుతాయి. 15 శాతం మందిలో మాత్రమే మెదడులో నరాలు చిట్లిపోయి అంతర్గత రక్తస్రావం అవుతుంది.

పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన పది పడకలతో న్యూరాలజీ విభాగంలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశాం. ఇక్కడే జనరల్ మెడిసిన్ విభాగంలోనూ కొందరు రోగులకు చికిత్స పొందుతున్నారు. స్ట్రోక్‌తో నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి వచ్చిన వారికి రూ.40 వేల విలువైన థ్రాంబోలైటిక్ థెరపీ చికిత్సను ఉచితంగా అందిస్తున్నాం. దీనివల్ల ప్రాణాపాయంతో పాటు వైకల్యం బారిన పడకుండా ఉంటారు.

–డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌ఓడీ, న్యూరాలజీ విభాగం, పెద్దాసుపత్రి

సత్వరం వైద్యం అందించాలి



బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి తీసుకొస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి. థ్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. ఇది వెంటనే నరాల్లో గడ్డకట్టిన రక్తాన్ని పలుచన చేసి మెదడుకు రక్త సరఫరాను పునరుద్ధరిస్తుంది. ఆ తర్వాత వస్తే మాత్రం మెదడులో న్యూరాన్స్ తగ్గిపోతాయి. ఈ కారణంగా మెదడుకు రక్తసరఫరా తగ్గిపోయి ఇబ్బంది ఏర్పడుతుంది. ఒకసారి స్ట్రోక్‌కు గురైన వారు రెండోసారి రాకుండా జాగ్రత్త పడాలి. సక్రమంగా మందులు వాడుతూ వ్యాధిని అదుపులో ఉంచుకోవాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్, నంద్యాల

మార్కెట్ కమిటీ అసిస్టెంటు సెక్రటరీపై వేటు?

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో అసిస్టెంటు సెక్రటరీని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఇక్కడ ఇద్దరు అసిస్టెంటు సెక్రటరీలు ఉన్నారు. ఒకరు అదనంగా ఉన్నారనే కారణంతో పాటు మార్కెట్ కమిటీ సెక్రటరీగా బదిలీ చేసేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. నదరు అసిస్టెంటు సెక్రటరీ గత నెలలో మల్టీపుల్ గ్రేడింగ్ యూనిట్ నిర్వాహకుడికి ఫోన్ చేసి 'వచ్చి మాట్లాడుకో'.. లేదంటే మంత్రి టీజీ భరత్ వచ్చి తాళం వేస్తారని ఫోన్‌లో బెదిరించారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. దీనిపై గత నెల 26న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'మాట్లాడుకో'.. 'లేదంటే తాళమే' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపి నివేదిక పంపాలని ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ రాయలసీమ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మిను ఆదేశించింది.

అంతర్ వర్సిటీల కబడ్డీ పోటీలకు ఆర్‌యూ జట్టు

కర్నూలు కల్చరల్: దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు ఎంపికైన రాయలసీమ యూనివర్సిటీ జట్టును వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ అభినందించారు. సోమవారం ఆర్‌యూ జట్టుకు క్రీడా దుస్తులను పంపిణీ చేసిన వీసీ అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టీలో జరిగే దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో ఆర్‌యూ జట్టు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. శివకిషోర్, వర్సిటీ కబడ్డీ జట్టు మేనేజర్ డాక్టర్ పి.ముత్యయ్య పాల్గొన్నారు.


ఆర్‌యూ కబడ్డీ జట్టుతో వీసీ ఎన్‌టీకే నాయక్

టమాట లారీ బోల్తా

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని య.కొత్తపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం బైకును తప్పించే క్రమంలో టమాట లారీ అదుపు తప్పి పక్కన ఆగి ఉన్న కారుపై పడింది. వివరాలు.. అనంతపురం నుంచి ఢిల్లీకి టమాట లోడుతో వెళుతున్న లారీ కొత్తపల్లె వద్దకు రాగానే ముందు వెళుతున్న బైకును తప్పించేక్రమంలో ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిచి ఉంచిన కారు మీద పడింది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో బైకుపై వెళుతున్న బలరాముడు, అతని కుమారుడు మహేంద్రతో పాటు టమాట లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జు కాగా లారీలోని టమాట రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదంపై పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.


లారీ బోల్తా పడటంతో నేలపాలైన టమాట

ఇద్దరు దొంగల అరెస్టు

- బంగారు, వెండి ఆభరణాల రికవరీ

నంద్యాల(సిటీ): దొంగతనాలకు పాల్పడే ఇద్దరు వ్యక్తులను నంద్యాల తాలూకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఇస్రార్ బాషా నిందితుల వివరాలు వెల్లడించారు. నిందితులు దక్కా కిరణ్ బాబు – కడమలకాల్వ, షేక్ హుస్సేన్ – సాధికనగర్ లను సోమవారం రైతునగరం హైవే బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి వారి నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారినుంచి నల్లపురెడ్డి వరకు – 3.38 తులాలు, రెండు చిన్న ఉంగరాలు – 0.620 గ్రాములు, ఒక పెద్ద ఉంగరం – 0.51 గ్రాములు, వెండి 500 గ్రాములు, మరో 2 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన ఎస్‌ఐ గంగయ్యయాదవ్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నాయుడు, పవన్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇస్రార్ బాషా

దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక


అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మురళీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన డాక్టర్ వి.మురళీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఒంగోలులోని సాయి ఐటీసీ కన్వెన్షన్ హాలులో 43వ రాష్ట్ర దంత వైద్యుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి 850 మంది దంత వైద్యులు హాజరయ్యారు. ఇందులో అత్యంత అడ్వాన్స్‌డ్ పరికరాలు, ఆధునిక చికిత్సల గురించి చర్చించారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా కర్నూలుకు చెందిన డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో కర్నూలు నుంచి దంత వైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, కిశోర్, నరేష్‌గౌడ్, దత్తసాయి, నందిని పాల్గొన్నారు.

వాహనం ఢీకొని నక్క మృతి

ఆత్మకూరురూరల్: స్థానిక అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు దాటుతున్న ఒక గోల్డెన్ జాకల్ (నక్క)ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో నక్క అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. విషయం తెలుసుకున్న నాగలూటి రేంజర్ దొరస్వామి నక్క మృతదేహాన్ని బైర్లూటి పశువైద్యశాలకు తరలించి పశువైద్యాధికారి డాక్టర్ జుబేర్‌తో పోస్ట్‌మార్టం చేయించారు. అనంతరం అటవీ సిబ్బంది నక్క కళేబరాన్ని దహనం చేశారు.

కొత్తూరు సుబ్బరాయుడి ఆదాయం రూ. 20.18 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి రూ. 20.18 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులు స్వామి వారికి హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. జూలై 20 నుంచి నేటి వరకు భక్తులు సమర్పించిన కానుకను లెక్కించగా రూ.20,18,305 నగదు, 2.300 గ్రాములు బంగారం, 925 గ్రాముల వెండి సమకూరినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. కానుకల లెక్కింపులో నంద్యాల డివిజన్ దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు శివరామిరెడ్డి, అర్చకులు వీరయ్య, క్రిస్టయ్య, రాముడు, మాధవస్వామి, నంద్యాల బాలాజీ సేవా సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలు ఆలకించేదెవరు?

ప్రజా సమస్యల పరిష్కారానికి ఇది వేదిక. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి దారి చూపుతారు. అయితే సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధికారులు సెల్‌ఫోన్ చూస్తూ అధిక సమయం గడిపారు. ఇది గమనించిన ప్రజలు ఇలాగైతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని చర్చించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

వినికిడి పరీక్షల శిబిరానికి స్పందన


మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): జాతీయ వినికిడి లోప రుగ్మతల నివారణ కార్యక్రమం, దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రంలో నిర్వహించిన ఉచిత వినికిడి లోప రుగ్మతల స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత చెప్పారు. ఈ శిబిరానికి జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి 0–19 ఏళ్ల పిల్లలు, వృద్ధులు కలిపి మొత్తం 256 మంది హాజరయ్యారన్నారు. వీరికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. వీరిలో 240 మందికి వినికిడి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, బాధితులకు త్వరలో అవసరమైన చికిత్స, వినికిడి పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ ప్రతినిధి విశ్వనాథ్, ఆడియాలజిస్టులు డాక్టర్ సింధు, డాక్టర్ ప్రశాంతి, డెమో శ్రీనివాసులు, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

మందుబాబుకు నెల రోజుల జైలు

- మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో చర్యలు

మహానంది: మండలంలోని ఎంసీ ఫారం గ్రామానికి చెందిన యువకుడు ఈ.శ్యామ్ మద్యం మత్తులో వీరంగం సృష్టించడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఘటనపై మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎంసీ ఫారం గ్రామానికి చెందిన శ్యామ్ ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఆడవారితో అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. దీంతో పాటు మహానంది వ్యవసాయ కళాశాల లేడీస్ హాస్టల్ వద్దకు వెళ్లి కేకలు వేస్తూ విద్యార్థినులను భయాందోళనకు గురిచేశాడని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 30 రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శ్యామ్ మహానందిలో ఇటీవల జరిగిన ఓ ఘర్షణ కేసులో ఏ3గా ఉన్నాడని బెయిల్‌పై బయట తిరుగుతున్నాడన్నారు.

ఎస్సార్బీసీకి నీటి విడుదల

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సమీపంలోని శ్రీశైలం కుడిగట్టుకాల్వ(ఎస్సార్బీసీ) 10వ బ్లాక్ కాల్వకు సోమవారం నుంచి అధికారులు నీటి విడుదలను పునరుద్ధరించారు. కాల్వకు అధికంగా నీటిని విడుదల చేయడంతో ఇటీవల కోవెలకుంట్ల – గుంజలపాడు ఆర్అండ్‌బీ రహదారికి 200 మీటర్ల దూరంలో గండి పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు మట్టికట్ట, ఇసుక బస్తాలతో గండిని పూడ్చివేశారు. రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కాల్వ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఎస్సార్బీసీ అధికారులు యథావిధిగా నీటి విడుదలకు చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఎస్సార్బీసీ పదో బ్లాక్ కాల్వలో ప్రవహిస్తున్న నీరు